ong-5_ong-5.qxd 4/13/2026 11:51 PM Page 1



## బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 3ఏళ్ల జైలు శిక్ష

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**

బాలికను మాయమాటలు చెప్పి తీసుకెళ్లి అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి ఒంగోలు పోక్సో కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించింది.దొనకొండ మండలానికి చెందిన 25 ఏళ్ల వ్యక్తి, 14 ఏళ్ల బాలికను 2022 మార్చి 5న మాయమాటలు చెప్పి ఇంటి నుంచి తీసుకెళ్లి హైదరాబాద్‌కు తరలించాడు. అక్కడ ఒక గదిలో ఉంచి ఆమె ఇష్టానికి విరుద్ధంగా అత్యాచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు దొనకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.దర్యాప్తును అప్పటి పొదిలి సీఐ యు. సుధాకర్ రావు పర్యవేక్షణలో నిర్వహించి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సమయంలో సాక్షులను సమయానికి హాజరు పరచగా, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.సమగ్ర సాక్ష్యాధారాల ఆధారంగా ఒంగోలు పోక్సో కోర్టు జడ్జి కె. శైలజ నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు.ఈ కేసులో సమర్థవంతంగా పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు అభినందించారు.

ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# అవాంతరాల స్పాట్.. పదో తరగతి మూల్యాంకణములు

**- అయ్యవార్లకు అగచాట్లు - నిత్యం నెట్వర్క్ సమస్య - మొరాయిస్తున్న ట్యాబ్‌లు**

**ఒంగోలు, ప్రభాతవార్త**

పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన మూల్యాంకణం ఉపాధ్యాయులుగా సవాల్‌గా మారింది. ముఖ్యంగా ట్యాబ్ ఆధారిత మార్కుల నమోదు ప్రక్రియ ఇక్కట్లకు గురి చేస్తుంది. స్పెషల్ అసిస్టెంట్లకు ఈ విధానం తలకు మించిన భారంగా మారింది. వారికి ఇచ్చిన ట్యాబ్‌లు సాంకేతిక సమస్యతో పాటు నెట్వర్క్ సరిగ్గా అందకపోవడంతో పడరానిపాట్లు పడాల్సి వస్తుందనివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు అసిస్టెంట్ ఎగ్జామినర్లకు కలిసి ఒక స్పెషల్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేస్తారు. ఆ స్పెషల్ అసిస్టెంట్ ట్యాబ్‌లో మార్కులు నమోదు చేస్తారు. ఇలా ప్రతి స్పెషల్ అసిస్టెంట్ రోజుకు 40 జవాబు పత్రాల చొప్పున ఇద్దరికి సంబంధించి 80 సమాధాన పత్రాలకు మార్కులను ట్యాబ్‌ల్లో అప్లోడ్ చేయాల్సి వస్తోంది. అలాగే ఒక్కో పేపర్ స్కానింగ్ చేయడానికి వారికి 15 నుంచి 20 నిమిషాలకు పైగా సమయం పడుతుందని తెలిసింది. దీనికి తోడు ఎక్కువ మంది స్పెషల్ అసిస్టెంట్లు ఒకేసారి నెట్వర్క్ వినియోగిస్తుండడంతో ట్యాబ్‌లు సైతం మొరాయిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రతి రోజు మూల్యాంకరణం పక్రియ అనేది ఒక ప్రహసనంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా జవాబు పత్రాల మూల్యాంకరణం ఉదయం 9గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం 5గంటలకు ముగుస్తుంది. అయితే ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ట్యాబ్ ఆధారిత మార్కుల నమోదు ప్రక్రియ సాంకేతిక సమస్యల కారణంగా రాత్రి పొద్దుపోయే వరకు జరుగుతుండడంతో నిత్యం అయ్యవార్లు అవస్థలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి మూల్యాంకణం విధులకు వచ్చే వారు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. నెట్వర్క్ సమస్య ఒక కారణం కాగా, విద్యార్థి రాసిన జవాబు పత్రంలోని ప్రతి పేజీని స్కాన్ చేసి అప్లోడ్ చేయాల్సి రావడంతో ఎక్కువ సమయం తీసుకుంటున్నట్లు తెలిసింది. దీంతో పాటు అసిస్టెంట్ ఎగ్జామినర్ దిద్దిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సి రావడం కూడా ప్రధాన సమస్యగా తలెత్తింది. దీంతో పాటు అధికారులు మార్కుల విషయంలో ఎటువంటి తేడా వచ్చినా పూర్తి బాధ్యతను స్పెషల్ అసిస్టెంట్లదేనని చెప్పడంతో వారిలో తీవ్ర ఒత్తిడి నెలకొందని తెలిసింది.



## నిర్ధిష్టమైన గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

**- జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి**

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిర్ధిష్టమైన గడువులోపు పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ద చూపాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, ఏ.మహేషన, డీపీఓ వెంకటేశ్వరరావులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అదికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ద చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అలాగే సంబంధిత అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 236 వినతులు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దీన్ దయాల్ స్పర్శ యోజన స్కాలర్షిప్ టెస్ట్‌కు ఆరుగురు విద్యార్థులు ఎంపిక

**- టాలెంట్ ఏ ఆ ఆరుగురు విద్యార్థులు హ్యాట్రిక్ - ప్రధానోపాధ్యాయురాలు ఉమ్మడిశెట్టి అనిత**

**జె పంగులూరు, ప్రభాతవార్త**



విద్యార్థిని, విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే అన్ని పోటీలలో పోటీ పడేందుకు అవకాశాల కోసం ప్రయత్నించాలని అప్పుడే ప్రతిఫలం ఈ తరహాలో లభిస్తుందని ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత అన్నారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలోని రావుల జానకి రామయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టల్ డిపార్ట్మెంట్ వారు నిర్వహించిన దీన్ దయాల్ స్పర్శ యోజన స్కాలర్షిప్ టెస్ట్‌కు ఆరుగురు విద్యార్థులు ఎంపికైనారని ప్రధానోపాధ్యాయురాలు శెట్టి ఇమ్మడిశెట్టి అనిత సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం అనిత మాట్లాడుతూ ఏకాగ్రతతో ఆలకించి, కృషి పట్టుదలతో ఎలాంటి వాటి లోనైన పోటీపడి ఫలితాలు సాధించవచ్చునని ఈ విద్యార్థిని, విద్యార్థులు నిరూపించారు. దీన్ దయాల్ స్పర్శ యోజన స్కాలర్షిప్ టెస్ట్ రాష్ట్రం మొత్తం మీద 40 మంది ఈ స్కాలర్షిప్‌కు ఎంపికైనారని, ఈ పాఠశాల నుంచి వరుసగా మూడవ సంవత్సరం సెలక్ట్ ఐ హ్యాట్రిక్ సాధించిన ఆ ఆరుగురు విద్యార్థిని, విద్యార్థులకు అభినందనలతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విద్యార్థులను అద్దంకి ఎం.ఓ కె.శ్రీనివాసరావు ముప్పవరం పోస్ట్ మాస్టర్ వై. నాగేశ్వరరావు, కొండమంజులూరు పోస్ట్ మాస్టర్ డి.విష్ణు, కొం డమంజులూరు రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ జి. తిరుమలయ్య పాఠశాలకు వచ్చి విద్యార్థిని, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి, అభినందనలు తెలిపారు. ఈ విద్యార్థులకు ఒక్కొక్కరికి 6వేల రూపాయలు స్కాలర్షిప్ పోస్టల్ అకౌంట్లో జమ అవుతుందన్నారు. పవన్, గోపికృష్ణ, హేమంత్, నాగ సుభాష్, ప్రదీప్తి, మనీషా, శి. హితేంద్ర, బి.వాత్సల్య నాగలక్ష్మీ స్కాలర్షిప్ అందుకున్న విద్యార్థిని, విద్యార్థులను ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మరియు ఎస్ఎంసి సభ్యులు అభినందనలు తెలిపి భవిష్యత్తులో కూడా మీరు మంచి విజయాలు సాధించి తల్లిదండ్రులకు, మీ గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు.

## పేస్‌లో ఘనంగా ముగిసిన ఫెస్టినో 2కె26

**ఒంగోలు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నాడు ఫెస్టినో 2కె26 ముగింపు వేడుకలలో భాగంగా చివరి ఫంక్షన్ అయినా సారంగ (డీజే మరియు లైవ్ మ్యూజిక్ బ్యాండ్) తో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ శ్రీ మద్దిశెట్టి శ్రీధర్ గారు మాట్లాడుతూ 18వ వార్షికోత్సవ సంబరాలను పురస్కరించుకొని ఫెస్టినో 2కె26 అనే ఈ పెద్ద ఈవెంట్‌ని మూడు భాగాలుగా విభజించి సృజన టెక్నికల్ ఫెస్ట్(శనివారం) సంగ్రామ్ (స్పోర్ట్స్ అండ్ కల్చరల్) (ఆదివారం), సారంగ్(డీజే. లైవ్ మ్యూజిక్ బ్యాండ్ సోమవారం) జిల్లాలోని ఏ ఇంజనీరింగ్ కాలేజీలో జరగనటువంటి విధంగా అంగరంగ వైభవంగా ఎంతో సరికొత్తగా ఈ ఫెస్ట్ నీ ముగించామని తెలియజేశారు. అదేవిధంగా సోమవారం నాడు జరిగిన ఫెస్ట్ లో ఇండియాలోనే పేరు పొందిన ఇన్ఫ్యూజన్ సంస్థ వారిచే లైవ్ మ్యూజిక్ బ్యాండ్ని ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో మంచి ఉత్సాహం వచ్చేలా ఉపయోగపడిందని చెప్పారు అలాగే డీజే ని ఏర్పాటు చేయడం ద్వారా డిజె సాంగ్స్ తోటి స్టెప్పుల్ తోటి విద్యార్థుల్లో మరింత ఆనందాన్ని కలిగింపచేశాయని



తెలియజేశారు. ఈ కార్యక్రమం తదుపరి కళాశాలలో 15 సంవత్సరాలు, 10 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు అలాగే ఉత్తమ ఉపాధ్యాయులకు మంచి బహుమతులు ప్రధానం చేసి మెమొంటోస్ తోటి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ సి వి సుబ్బారావు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ కె రూప అక్కేష్, కళాశాల హెచ్ఆర్ డాక్టర్ పుష్ప కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ ఎం రమణ బాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు ఈ ఫెస్టినో 2కె26 ఘనంగా ముగించారు.

## ప్రకాశం ఉమ్మడి జిల్లాల్లో 115 ప్రదేశాలలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**- ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ప్రత్యేక నిఘా చర్యలు**

**- మీడియా సమావేశంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు**

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**





రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రకాశం మరియు మార్కాపురం జిల్లాల్లో పోలీసులు సమగ్ర కార్యాచరణ చేపట్టారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను తగ్గించే దిశగా చర్యలు అమలు చేస్తున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పి. రాజబాబు సహకారంతో 125 కన్వెక్స్ మిర్రర్లు (కుంభాకార దర్పణాలు), 150 స్ప్రింగ్ పోల్స్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. రెండు జిల్లాల్లో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్న 115 బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ నేషనల్ హైవే మరియు ఆర్ బి అధికారులతో కలిసి కన్వెక్స్ మిర్రర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీటి ద్వారా మలుపుల్లో కనిపించని వాహనాలను ముందుగానే గుర్తించి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.ఒంగోలు పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం, నార్త్ బైపాస్, సౌత్ బైపాస్, మంగమూరు జంక్షన్ వంటి ప్రధాన కూడళ్ల వద్ద ఫ్రీ లెఫ్ట్ మార్గాల్లో వాహనదారుల సౌకర్యార్థం స్ప్రింగ్ పోల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త నేషనల్ హైవే రోడ్లపై అవగాహన లోపంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రమాదం తర్వాత పశ్చాత్తాపం చెందడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ప్రత్యేక నిఘా ఉంచి, ప్రయాణికుల భద్రత కోసం ప్రతిరోజూ రాత్రి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, ఫైర్ సేఫ్టీ పరికరాలు, డ్రైవర్ల లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మరియు విధి గంటలను తనిఖీ చేస్తున్నారని చెప్పారు.అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ వంటి ప్రమాదకర అలవాట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి చేయాలని, సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూట్ ప్రయాణం వంటి ఉల్లంఘనలను నివారించాలని సూచించారు.రోడ్డు భద్రతలో జిల్లా కలెక్టర్ పి. రాజబాబు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎస్పీపేర్కొన్నారు. సమావేశంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లా డైయిరీని పున: ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాము: లంకా దినకర్

**ఒంగోలు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా డైయిరీకి పూర్వ వైభవం కల్పించాలని, పున: ప్రారంభం చేయాలని ప్రకాశం జిల్లా పాడి రైతులు వినతి పత్రం అందచేశారని, ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి ఆ ప్రాంత రైతాంగానికి మేలు చేసేలా చర్యలు తీసుకుంటానని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ఏపీ సచివాలయంలోని లంకా దినకర్ తన ఛాంబర్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకులు ప్రకాశం జిల్లా డైయిరీని ప్రైవేటు సంస్థలకు అన్యాక్రాంతం చేయడానికి, దారాదత్తం చేయడానికి తీసుకున్న నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. అయితే రైతులు సుముఖంగా లేకపోవడంతో సదరు సంస్థలు సైతం డైయిరీ ని నడపలేని స్థితికి చేరుకున్నాయన్నారు. నేడు ప్రకాశం జిల్లా పాడి రైతులు, పాల ఉత్పత్తి దారులు తిరిగి ప్రకాశం జిల్లా డైయిరీని ప్రారంభించాలని కోరుతూ తనకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రైతుల విన్నపాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పాడిరైతులకు న్యాయం చేస్తానని హామి ఇచ్చారు. అలా డైయిరీ కార్యకలాపాలు ప్రారంభించకపోతే డైయిరీ విలువైన ఆస్థులు అన్యాక్రాంతం అయిపోతాయని ఆ ప్రాంత రైతాంగం ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తన వద్దకు ప్రకాశం జిల్లా బిజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు కావూరి వాసు ఆధ్వర్యంలో పాడి రైతులు తనను కలవడం జరిగిందన్నారు. ప్రకాశం డైయిరీ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తి, పాల సేకరణతో పాటు పాలపొడి ప్యాక్టరీ సైతం నిరుపయోగంగా ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి డైయిరీని తిరిగి పున:ప్రారంభానికి చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## ఖోఖో పోటీలలో సత్తా చూపిన రైజ్ విద్యార్థునులు

**ఒంగోలు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



పేస్ ఇంజనీరింగ్ కాలేజీ వారు నిర్వహించిన పేస్ ఫెస్టినో 2026, కార్యక్రమములో కల్చరల్, జాతీయ స్థాయి మహిళా కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించగా, అందులో రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్‌కు చెందిన ఖో ఖో టీం ప్రథమ స్థానములో, నిలిచినట్లు కళాశాలల సెక్రటరీ శిద్దా హనుమంత రావు తెలియచేసారు. కళాశాల రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక మాట్లడుతూ పేస్ ఇంజనీరింగ్ కాలేజీ వారు నిర్వహించిన పేస్ ఫెస్టినో2026లో పలు కళాశాలల నుండి 8 టీంలు ఈ ఖోఖో పోటీలలో పాల్గొన్నాయి, ఈ పోటీలలో రైజ్ విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ప్రథమస్తానాన్ని, గెలుచుకోవడం ఎంతగానో ఆనందంగా ఉందని తెలియచేస్తూ, విజేతలను అభినందించారు. విద్యార్థినులకు చదువు తో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, ప్రస్తుత పరిస్థితులలో మానసికంగా ఆరోగ్యముగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, తెలియచేస్తూ క్రీడలలో రాణించిన విద్యార్థినులను కళాశాల ఛైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్ అభినందించారు. ఈ కార్యక్రమములో విజేతలైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఇస్కాల చిన రంగమన్నారు, శిద్దా ప్రవల్లిక, డైరెక్టర్ డాక్టర్ తిజు భాస్కరరావు, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం ఫిజికల్ డైరెక్టర్స్ హిమచంద్రబాబు, వెంకటేశ్వర్లు అభినందించారు.

## నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్ల తయారీపై కేసు నమోదు

**బల్లికురవ ఏప్రిల్ 13( ప్రభాతవార్త)**



నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్లు తయారు చేస్తూ, వాహనదారులకు విక్రయిస్తూ, ప్రజా ప్రతినిధుల హక్కులను దుర్వినియోగం చేస్తున్న వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలియజేశారు. గతంలో అద్దంకి ఎమ్మెల్యే ,రాష్ట్ర ఇంధన శాఖ, గొట్టిపాటి రవికుమార్ పేరుతోను, రెవిన్యూ శాఖ మంత్రి అనగానే సత్యప్రసాద్ పేరుతోను నకిలీ స్టిక్కర్లు వెలుగు చూసిన విషయం పాఠకులకు విధితమే. విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు మంత్రి గొట్టిపాటి పేరుతో ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న కారును అదుపు లోకి తీసుకున్న విషయం కూడా తెలిసిందే. ఈ మొత్తం వ్యవహారంపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. స్టిక్కర్ల దుర్వినియోగంపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో దర్శి డి.ఎస్.పి బాలమురళీకృష్ణ పర్యవేక్షణలో,సంతమాగులూరు సిఐ కాకుమాని వెంకట్రావు పర్యవేక్షణ లో, బల్లికురవ ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నకిలీ స్టిక్కర్ల తయారీ వ్యక్తులపై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ క్రమంలో భాగంగా కీలక సమాచారాన్ని, అందుకున్న ఎస్ఐ నాగరాజు ప్రత్యేక చొరవతో కీలక వ్యక్తుల సమాచారం అందిపుచ్చుకున్నట్లు తెలుస్తోంది. నిందితులను అదుపులోకి తీసుకునేందుకు శాఖపరమైన చర్యలతో సిద్ధమవుతున్నారు. సాధారణంగా ప్రతి ఏటా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన అనంతరం ఏప్రిల్ మాసంలో ప్రతి ఎమ్మెల్యేకు మూడు స్టిక్కర్లను సచివాలయ అధికారులు జారీ చేస్తుంటారు. అవి ఏకారణం చేతనైనా పనిచేయకపోతే మరో రెండు అదనపుస్టిక్కర్లను ఎమ్మెల్యేలకు అందజేస్తారు. అయితే ఈ స్టిక్కర్లను పోలిన నకిలీ స్టిక్కర్లను తయారు చేస్తూ, అక్షరాల లక్షల సంపాదిస్తున్న నకిలీల ముఠా ఆట కట్టించేందుకు, పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది.

## వీఆర్వోలను అవమానించిన కొత్తపట్నం తహసీల్దార్

**కొత్తపట్నం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



కొత్తపట్నం మండల తహసీల్దార్ నయాబ్ రసూల్‌పై వివాదం నెలకొంది. వీఆర్వోలను చేతులు కట్టించి పాగుణింతాలు చెప్పమని ఆదేశించినట్టు ఆరోపణలు వెలువడ్డాయి. చెప్పలేకపోవడంతో వారిని దూషిస్తూ, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారని వ్యాఖ్యా నించినట్టు సమాచారం. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సిబ్బందిలో అసంతృప్తి వ్యక్తమవు తోంది. అధికారులు దీనిపై వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## ఆగని అన్నా ట్యాంక్ ఆక్రమణలు..

**- చూస్తూ ఉన్న రెవెన్యూ అధికారులు**

**కొత్తపట్నం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన కొత్తపట్నం రెవెన్యూ కాంప్లెక్స్ పరిధిలోని అన్నా ట్యాంక్‌లో రోజురోజుకు ఆక్రమణలు పెరుగుతున్నాయి. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారుల నుండి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి అక్రమంగా పట్టాలు మంజూరు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే, సర్వే నంబర్ 1410లో ఉన్న అన్నా ట్యాంక్ ప్రధానంగా రైతుల సాగునీటి అవసరాల కోసం ఉపయోగించబడేది. వర్షాకాలంలో ట్యాంక్‌లో నీరు నిల్వ ఉండి, దాని కింద సుమారు 40 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేది. అయితే ఇటీవల కాలంలో ఈ ట్యాంక్ ఆక్రమణలకు గురవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రెవెన్యూ కార్యాలయంలో అధికారులు కంటే బ్రోకర్లే ప్రభావం చూపుతున్నారని రైతులు చెబుతున్నారు. సమస్యలతో కార్యాలయానికి వెళ్లిన వారికి సరైన స్పందన లేకపోవడం, బ్రోకర్ల ద్వారా వెళ్లిన వారికి మాత్రం తక్షణమే పనులు పూర్తవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంకా, అన్నా ట్యాంక్ పరిధిలో సుమారు 50కి పైగా కుటుంబాలు పట్టాలు లేకుండా నివసిస్తున్నాయి. భారీ మొత్తంలో డబ్బులు చెల్లించిన వారికి మాత్రమే పట్టాలు ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ట్యాంక్ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయి. గతంలో ఒక తహసీల్దార్ భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని టైల్స్ వ్యాపారానికి అనుమతి ఇచ్చినట్లు సమాచారం.రెవెన్యూ కార్యాలయంలో అధికారులు కంటే బయటి వ్యక్తులు ఎక్కువగా సంచరిస్తూ, కార్యాలయం బ్రోకర్ల కేంద్రంగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## ప్రజాసమస్యల పరిష్కార వేదిక్తకు 74 ఫిర్యాదులు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ప్రజల సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం లేకుండా, ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన"ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)" కార్యక్రమంలో మొత్తం 74 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదిదారుల వ్రాతపూర్వక వినతులను ఎస్పీ మరియు పోలీస్ అధికారులు స్వీకరించి, వారితో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను చట్టపరమైన పరిధిలో పరిష్కరిస్తామని బాధితులకు భరోసా కల్పించారు.అందిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు వెంటనే సమాచారం అందించి, తక్షణ విచారణ చేపట్టి నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా భూ వివాదాలు, ఆర్థిక తగాదాలు, అత్తరింటి వేధింపులు, ఉద్యోగాల పేరుతో మోసాలు, చీటింగ్ కేసులకు సంబంధించిన ఫిర్యాదులు నమోదయ్యాయి.కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, వివిధ సీఐలు, ఇన్స్పెక్టర్లు, ప్యానెల్ అడ్వొకేట్ బి. బాలాజీ సింగ్ పాల్గొన్నారు.

## అంబేడ్కర్ జయంతి సందర్భంగా బసవన్నపాలెంలో సేవా కార్యక్రమాలు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

డా. బి.ఆర్. అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా బసవన్నపాలెం గ్రామంలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలు గ్రామస్థుల ప్రశంసలను అందుకున్నాయి.ఎయిమ్స్ హాస్పిటల్, ఒంగోలు సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించగా, సుమారు 200 మంది ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండీ డాక్టర్ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేడ్కర్ ఆలోచనలు సమాజంలో సమానత్వం, విద్య మరియు హక్కుల పరిరక్షణకు మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు.

6_6.qxd 4/13/2026 11:45 PM Page 1



## అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
మాచవరం హైస్కూల్ నందు బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ముందస్తు వేడుకలను సోమవారం నిర్వహించారు. తొలుత గ్రామ పెద్దలు, ప్రధానోపాధ్యాయులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం, దేశ అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని వివరించారు. విద్యార్థులు అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుమ్మడి విజయ్ స్టాలిన్, హెచ్ఎం శివరాం ప్రసాద్, పీడీ సురేష్‌బాబు, శ్రీను, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వద్దిమడుగు యూపీ పాఠశాలలో ఘనంగా అంబేద్కర్ జయంతి



**కొనకనమిట్ల, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
మండలంలోని వద్దిమడుగు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాళ్లూరి నరసింహారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి దేశం కోసం ఆయన చేసిన సేవలు గురించి వివరించారు. పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థి బూదాల జెస్సిక అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి చాలా చక్కగా ఉపన్యాసం చేసింది. ప్రతిభ చూపిన విద్యార్థినికి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రసూనదేవి, ప్రసాదరావు, పద్మజ, నందిని, భార్గవి, మల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## నారీ శక్తి వందన్ అధినియమ్ బిల్లు చారిత్రాత్మకం

### - బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మీ





**పొదిలి,ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
పార్లమెంటులో ఈనెల 16 నుంచి జరిగే ప్రత్యేక సమావేశాలలో ప్రవేశపెట్టనున్న నారి శక్తి వందన్ అదినియం బిల్లు చారిత్రాత్మకమని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మీ అన్నారు. సోమవారం పొదిలి ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన ప్రింట్ ఎండ్ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఏప్రిల్ 16వ తేదీ నుండి మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాలలో నారీ శక్తి అధినియమ్ బిల్లు(చట్టసభలలో మమిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు) ప్రవేశపెట్ట బోతున్నట్లు పేర్కొన్నారు. మన దేశ జనాభాలో 50 శాతం పైన మహిళలు ఉన్నప్పటికి ప్రస్తుతం పార్లమెంటులో కేవలం 14వాతం మాత్రమే మహిళా పార్లమెంటు సభ్యులు ఉన్నారని, చట్టసభలలో మహిళల అధిక సంఖ్యలో ఉండదానికి గాను మాజీ ప్రధానమంత్రి దేవగౌడ హయాంలో ఒక పర్యాయం, 1966లో ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో, బీజేపీ 2023 ఆగష్టు 23వ తేదీ మరోసారి పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టినప్పటికి అప్పుడు రాజకీయ పార్టీల సరైన మద్దతు లేక ఆమోదం పొందలేక పోయిందని, ఈనెల 16వ తేదీ నుండి 3 రోజుల పాటు జరుగు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలలో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడుతున్నారని, ఈ శుభ తరుణంలో ఈ బిల్లును ఆమోదించడానికి రాజకీయాలకు అతీతంగా, పార్లమెంట్‌లో ఉన్న అన్ని రాజకీయ పక్షాలకు చెందిన మొత్తంపార్లమెంటు సభ్యులు చారిత్రాత్మకమైన బిల్లుకు మద్దతు ఇచ్చి ఆమోదించాలని ఆమె కోరారు. ఈ బిల్లు మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిరకాల స్వప్నమని, యావత్ భారతదేశ మహిళల యొక్క చిరకాల వాంఛ, కోరిక అన్నారు. భారతదేశం ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుందని, ఈ దేశానికి 1947 స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి 2047 నాటికి 100 సంవత్సరాలు పూర్తవుతుందని, అప్పటికి మన వికసిత్ భారత్ లక్ష్యాన్ని మహిళా సాధికారతను సాధించడానికి నారి శక్తి వందన్ అధినియమ్ 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొంది చట్టం అయితే ఈ దేశంలో ఉండే మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 2029 తదుపరి జరుగు పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో మన మహిళా సోదరీ, సోదరీమణులు మన దేశంలో ఉన్న చట్టసభలలో 33 శాతం మంది మహిళలు ప్రాతినిద్యం వహించే గొప్ప అవకాశం, చిరకాల స్వప్నం నెరవేరుతున్న ఈ శుభ సందర్భంగా మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , భారత పార్లమెంటు ఉభయ సభలలో ఉన్న మొత్తం పార్లమెంటు సభ్యులు, యావత్ భారతదేశంలో ఉన్న మహిళలు పార్లమెంటు సభ్యులు, దేశంలో ఉన్న మహిళా శిరోమణులు, ప్రజలు సంపూర్ణ నైతిక మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఏఎంసీ డైరక్టర్, న్యాయవాది ఇనగంటి శైలజ, ఏఎంసీ డైరక్టర్ పువ్వాడ నారాయణమ్మ, టీడీపీ నాయకులు లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ అధినేత వరికూటి శిరీష, నేలటూరి శైలజ, పొదిలి ఏఎంసీ మాజీ డైరక్టర్ కిరణ్మయి, బిట్స్ కాలేజీ లెక్చరర్ కుమారి, ఎస్‌కే హామీద, బీజేపీ జిల్లా మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాషా, బీజేపీ సీనియర్ నాయకులు మాగులూరు రామయ్య, పొదిలి శివాలయం డైరక్టర్ నూతక్కి నాగేశ్వరరావు, ఎస్‌కే చిన్న భాష, జి.భార్గవ నాయుడు, నరసింహారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లుకు మద్దతుగా ప్లకార్డులు పట్టుకుని పెద్ద బస్టాండ్ వరకు రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

### - పొదిలి ఎస్సై రాజేష్



**పొదిలి, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలతో పాటు జరిమానా విధించడం, జైలుకు పంపటం జరుగుతుందని ఎస్సై రాజేష్ తెలిపారు. సోమవారం పొదిలి పెద్ద బస్టాండ్‌లో వాహనాలను తనిఖీ చేసి, సరైన పత్రాలు, హెల్మెట్ లేని వారికి అపరాధ రుసుము వసూళ్ళ చేయడం జరిగిందని చెప్పారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి కఠిన చర్యలతో పాటు జైలుకు పంపడం ఖాయమన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు.

## అంబేద్కర్ ఆశయాలే మార్గదర్శకం

### - ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**మార్టూరు, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ప్రభుత్వ ధ్యేయమని, ఆయన ఆశయ సాధనకే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలే మార్గదర్శకమని స్పష్టం చేశారు. మహా మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేదర్ 135వ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలను దేశానికి అందించిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. కుల వివక్ష, అస్పృశ్యత, మూఢనమ్మకాలపై ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయం అని అన్నారు. అంబేద్కర్ కల ప్రజలందరికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించడం అని, అణగారిన వర్గాలు గౌరవంగా జీవించాలంటే విద్య, హక్కులు, అవకాశాలు కీలకమని ఆయన చూపించారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ కృషి చేసిందని ఆయన పేర్కొన్నారు. కేఆర్ నారాయణను రాష్ట్రపతిగా, బాలయోగిని లోకసభ స్పీకర్‌గా, ప్రతిభాభారతిని శాసనసభ స్పీకర్‌గా చేయడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలను ఎమ్మెల్యే ఏలూరి గుర్తు చేశారు. చంద్రబాబు నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఏర్పాటు, మొబైల్ కోర్టులు, స్పెషల్ కోర్టులు, సబ్ ప్లాన్ నిధుల సమర్థ వినియోగం, దళిత కాలనీల అభివృద్ధి, ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశాం అని ఎమ్మెల్యే ఏలూరి చెప్పారు. అమరావతిలో అంబేద్కర్ సేవలను చిరస్థాయిగా నిలిపేందుకు 125 అడుగుల విగ్రహ నిర్మాణం చేపట్టామని, అయితే వైసీపీ ప్రభుత్వం అంబేద్కర్ స్మృతి వనాన్ని నాశనం చేయడం బాధాకరమని విమర్శించారు. అంబేద్కర్ ఆశయాలను వైసీపీ మంటగలిపిందని విమర్శలు చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించడం, దళిత సంక్షేమ పథకాలను రద్దు చేయడం దుర్మార్గం అన్నారు. గత ఐదేళ్లలో వేల సంఖ్యలో దళితులపై దాడులు జరిగాయని ఎమ్మెల్యే ఆరోపించారు. అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని, మహద్ చెరువు పోరాటం నుంచి రాజ్యాంగ రచన వరకు ఆయన ప్రతి అడుగు సమానత్వం కోసం సాగిందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను యువత ఆచరణలో పెట్టాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, న్యాయం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు.

## ప్రభుత్వ బడిని కాపాడుకుందాంపై ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహణ



**మార్టూరు, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
రాష్ట్ర యుటీఎఫ్ శాఖ పిలుపు మేరకు మార్టూరు మండల శాఖ కార్యవర్గం ప్రభుత్వ బడిని కాపాడుకుందాం పేరిట చిమ్మిరిబండ గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి గ్రామస్తులను, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వేలకు వేలు ప్రైవేటు పాఠశాలల ఫీజులకు కట్టి ఆర్థిక ఇబ్బందులు పాలు కాకుండా, మీ సమీపంలోనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్నఉచిత సౌకర్యాలను ఉపయోగించుకోవాలని, ఉన్నత విద్యావంతులై శిక్షణ పొందిన టీచర్ల యొక్క విద్యాబోధన ప్రాముఖ్యతను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో చిమ్మిరిబండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందిమళ్ళ నాగేశ్వరరావు, టీచర్స్ జి.రామదాసు, మండల యూటీఎఫ్ శాఖ జనరల్ సెక్రటరీ కే.లక్ష్మీకాంత్, బొప్పూడి నాగేశ్వరరావు, వై.ఏడుకొండలు, పి.శ్రీనివాసరావు, వి.ప్రభాకర్‌రావు, సీఆర్పీ జి.రమేష్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

### - మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు

**మార్టూరు, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నేడు మంగళవారం ఉదయం 9గంటల నుంచి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ పెద్ద ఎత్తున హాజరై ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్నిసద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఏలూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్టు, నోవా అగ్రి గ్రూపు, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ సంయుక్తంగా, శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలతో పాటు బీపీ, షుగర్, రక్త పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించనున్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఉచిత శస్త్ర చికిత్సలు కూడా అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రజలకు సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## గ్రీవెన్స్‌డే నిర్వహణలో అధికారులు విఫలం

### - వెలవెల బోతున్న ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం



**కందుకూరు ఏప్రిల్ 13,(ప్రభాతవార్త)**
కందుకూరు నియోజవర్గంలో ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం సజావుగా నిర్వహించడంలో సంబందిత అధికారులు విఫలం అవుతున్నారు. సమస్యలు పరిష్కారం కొరకు అర్జీదారులు ప్రజాప్రతినిధిల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇందులోభాగంగానే సోమవారం గుడ్లూరు పలువురు మహిళలు తమసమస్యలను ఎమ్మెల్యే వివరించారు. అయితే ప్రధానంగా తహసిల్దార్ అధ్యక్షతన ఆయా మండలాలలో ఈ కార్యక్రమం నిర్వహించాలి. ఇందుకోసం ప్రభుత్వం అధికప్రాధాన్యత ఇస్తుంది. మండల, డివిజన్ స్థాయిల్లో జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని అర్జీదారులు హాజరై తమ తమ సమస్యలు పరిష్కరించుకు నెందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్నిశాఖల అదికారులు హాజరవాలి. అర్జీదారులు సమస్యను సత్వరమే పరిష్కరించాల్సి ఉంది. అయితే తహసిల్దార్‌ల నిర్లక్ష్యం, అశ్రద్ధ కారణంగా ఈ కార్యక్రమం వెలవెలబోతుంది. ఒకరిద్దరు మినహా ఆయా శాఖల నుంచి బాధ్యతాయుత అధికారులు హాజరుకావడంలేదు. దీంతో అర్జీదారులు సైతం ఇక్కడ సమస్యకు పరిష్కారం దొరకదని నిర్ధారించుకున్నారు. జిల్లా బాట పట్టారు. ఇందుకోసం అనేక కష్టనష్టాలకు గురువతున్నారు. అయినా వారిపై చర్యలు లేకపోవడంతో అధికారులంతా అదేబాటను ఎంచుకుంటున్నారు. అదికారులు రాకపోవడంతో అర్జీదారులుకు ఈ కార్యక్రమంపై నమ్మకం సన్నగిల్లింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం నిర్వీర్యం అవుతుంది. ఇందులో బాగంగా సోమవారం వలేటివారిపాలెం లింగసముద్రం, కందుకూరు, గుడ్లూరు, ఉలవపాడు మండలాలలో జరిగిన ఈ కార్యక్రమంలో బాధ్యతాయుతమైన అధికారులు సకాలంలో రాలేదు. గతకొంతకాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సంబందితర అధికారులుపై చర్యలులేవు. దీంతో నిర్వహణాధికారులు పలు ప్రలోభాలకు లోనవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## గుడ్లూరు గ్రీవెన్స్‌కు అధికారులు డుమ్మా!

### - ఎమ్మెల్యే ఇంటూరి ఆగ్రహం



**కందుకూరు ఏప్రిల్ 13,(ప్రభాతవార్త)**
గుడ్లూరులో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన గివెన్స్ కార్యక్రమానికి ముఖ్యమైన అధికారులు డుమ్మాకొట్టారు. దీంతో అర్జీదారులు నిరాశానిస్పృహలకు గురయ్యారు. అయితే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరైనారు. అధికారులు గైరుహాజరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయనే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 31 శాఖల అధికారులకు గాను, కేవలం 8 మంది మాత్రమే హాజరు కావడంపై ఎమ్మెల్యే నాగేశ్వరరావు మండిపడ్డారు. ఇకనుంచి తప్పనిసరిగా గ్రీవెన్స్‌కు హాజరు కావాలన్నారు. తహసిల్దార్‌కు బదులు ఆర్ ఐ ప్రసాద్ హాజరైనారు. వివిద ఇంజనీరింగ్ శాఖల అధికారులు హాజరుకాలేదు. గత 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను నాగేశ్వరరావు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే కారణంగా రెవెన్యూ సమస్యలు ఎక్కువగా వచ్చాయన్నారు. ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి పెట్టిందన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేస్తూ, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటునని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఐరన్ వోర్ ఖనిజాలను ప్రభుత్వమే నిర్వహించాలి

### - సీపీఎం డిమాండ్



**కందుకూరు ఏప్రిల్ 13,(ప్రభాతవార్త)**
వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లోని ఐరన్, వోర్ ఇనుప ఖనిజాల నిక్షేపాలను జిందాల్ అనే కార్పొరేట్ సంస్థకు అప్పగించడం తగదని సిపిఎం ఉలవపాడు వలేటివారిపాలెం ప్రాంతీయ కమిటీ జిల్లా కార్యదర్శి యం. రమేష్ అన్నారు. సోమవారం సిపిఎం ఉలవపాడు, వలేటివారిపాలెం ప్రాంతీయ కమిటీ సమావేశం కందుకూరులో దువ్వూరి జాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలేటివారిపాలెం మండలంలోని అయ్యవారిపల్లి వద్ద కొండలలో ఉన్న సహజ సంపద అయిన ఐరన్ వోర్ నిక్షేపాలను జిందాల్ అనే కార్పొరేట్ కంపెనీకి ఇవ్వటం తగదని పేర్కొన్నారు. ప్రభుత్వమే వీటిని నిర్వహించాలన్నారు. సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యం.రమేష్ కోరారు. వలేటివారిపాలెం మండలంలోని అయ్యవారిపల్లి, చుండి, మాలకొండ, లింగసముద్రంలోని ఎర్రారెడ్డిపాలెం కొండలలో ఉన్న మ్యాగ్న టైట్ ఇనుప ముడిఖనిజాన్ని, గనులను విశాఖ స్టీల్ ప్లాంట్ కి కేటాయించాలని, ప్రభుత్వమే నోటిఫికేషన్ వేయాలని కోరారు. వలేటివారిపాలెం లింగసముద్రం ప్రాంతాలను యువతకి తద్వారా ఉపాధి అవకాశాలు కలుగుతాయని, కార్పొరేట్ సంస్థ అయినా జిందాల్ అప్ప చెప్పడం వలన నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలందరి సమీకరించి రాబోయే కాలంలో ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో వలేటివారిపాలెం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్, కమిటీ సభ్యులు ఎస్.డి. గౌస్ భాషా, కత్తి. సుజాత, ఏలూరి. నాగార్జున, సాదు. చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంగమూరు పోషణ పక్వాడా వేడుకల్లో భాగంగా ర్యాలీ



**సంతనూతలపాడు, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
సంతనూతలపాడు మండలం మంగమూరు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నాడు ఘనంగా పోషణ పక్వాడా పక్షోత్సవ వేడుకలు నిర్వహించారు. తల్లులు, గర్భవతులు, బాలింతలకు క్వాలిటీ పౌష్టికాహారం పట్ల ఏఎన్ఎం సుభాషిణి, నాయకులు రాజు, అంగన్‌వాడీ టీచర్ నిషలు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాండసింగు రాజు, సుభాషిణి, అంగన్‌వాడీ టీచర్ విజయ, నిష, సావిత్రి, అంజిలి, మాధవి, చంద్రవతి, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఈ కాలపు యుగ కర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

### విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి





**ఒంగోలు ,ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మల మని అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ సామాజిక సమానత్వం కోసం సౌభ్రాతృత్వం కోసం బోధించు సమీకరించు పోరాడు అనే అంబేద్కర్ ఆలోచన విధానమును విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యాసం చేస్తూ అణగారిన వర్గాలకే కాక అల్పసంఖ్యాక వర్గాలకే కాక యావత్ భారతదేశానికి సమతా వాదాన్ని ప్రజాస్వామ్య వాదాన్ని భారతదేశానికి అందించిన మహోన్నతుడని రాజ్యాంగాన్ని ప్రాథమిక హక్కులను ఆదేశిక సూత్రాలను స్వాతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయ వ్యవస్థను భిన్నత్వంలో ఏకత్వమును సమీకరించిన యుగ పురుషుడని వారి భావ లని సిద్ధాంతాలను విద్యార్థులు ప్రేరణగా తీసుకోవాలని పేర్కొన్నారు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ బి హరిబాబు విశిష్ట అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ అంబేద్కర్కి బరోడా మహారాజు సహాయ సహకారాలు అందించకపోతే కొలంబియా విశ్వవిద్యాలయంలో చదివేవాడే కాదని అంబేద్కర్ ని సింబల్ ఆఫ్ నాలెడ్జ్ గాను ప్రశంసించారని ఐక్యరాజ్యసమితి అంబేద్కర్ పుట్టినరోజును ప్రపంచ విజ్ఞాన దినోత్సవం గా పేర్కొన్నారని విద్యార్థులకు బోధించారు మరొక ప్రత్యేకత అతిథి ప్రొఫెసర్ జి రాజమోహన్ మాట్లాడుతూ మహద్ చెరువు పోరాటము కాలారం టెంపుల్ ప్రవేశ ఉద్యమం నడిపిన మహోన్నతుడని పేర్కొన్నారు మరొక అతిథి ప్రొఫెసర్ సోమశేఖర్ మాట్లాడుతూ ఏ జాతి అయితే తాము కోల్పోయిన హక్కుల కొరకు పోరాటం చేయదో ఆ జాతి కనుమరుగవుతుందని పేర్కొన్నారు జాతివిముక్తి పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు మరొక అతిథి డాక్టరు కెవిఎన్ రాజు మాట్లాడుతూ అంట రానితనం అవమానాలతోనే వారి జీవితము పోరాటాల వైపు మళ్ళిందని అంబేద్కర్ లేకపోతే ఈ దేశంలో అణగారిన వర్గాలకు దళిత జాతులకు జీవితాలు ఎంతో ఘోరంగా దీనంగా ఉండేవని వారి పోరాటాల ద్వారానే స్వేచ్ఛ సమానత్వం కల్పించారని పేర్కొన్నారు విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవకుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానమే ఈ దేశానికి శరణ్యమని వారి సిద్ధాంతాలే దేశానికి మార్గమని ఆర్థిక సామాజిక సమానత్వం లేనిది రాజకీయ సమానత్వము నిష్ప్రయోజనం అని అనగారిన వర్గాలకు ఓటు హక్కు కల్పించిన మహోన్నతుడని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు రీసెర్చ్ స్కాలర్సు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయుట జరిగింది

## పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

### - 14 రోజులు రిమాండ్



**సింగరాయకొండ,ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
మండలంలోని శానంపూడి గ్రామంలో మైనర్ బాలికపై తండ్రి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు పోక్సో కేసునమోదు చేశారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బి. మహేంద్ర పాత్రికేయులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని శానంపూడి గ్రామం, మిట్టపాలెంలో మద్యం మత్తులో తండ్రి మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు చీడి తోటి సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతనిపై క్రైం నంబర్ 48/26 కింద బిఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 64 r/w 62తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 8ప్రకారం పలుసెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం అతన్ని కోర్టు ముందు హాజరుపరిచగా, సింగరాయకొండ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి నిందితునికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## న్యాయవాదుల భద్రతకు డిమాండ్

### - సింగరాయకొండలో కోర్టు విధుల బహిష్కరణ



**సింగరాయకొండ, ఏప్రిల్ 13,(ప్రభాతవార్త)**
రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, హత్యలకు నిరసనగా సింగరాయకొండ లో న్యాయవాదులు భద్రత కు డిమాండ్ చేశారు. సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వద్దిపల్లి గ్రామానికి చెందిన యువ న్యాయవాది ఎల్లయ్యపై జరిగిన దాడి, చిలకలూరిపేటలో ఒంగోలుకు చెందిన న్యాయవాది రామ హరిప్రసాద్ హత్యలను తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలని, మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే భవిష్యత్తులో మరింత తీవ్రఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బక్కమంతల వెంకటేశ్వర్లు, కొల్లూరి వెంకట నరసింహారావు, రాఘవేంద్రరావు, సంజీవరెడ్డి, పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## టీడీపీ పాలనలో మత్స్యకారుల జీవితాలలో పెను మార్పులు సృష్టించిన జువ్వలదిన్నె

### - ఎమ్మెల్యే విజయ్ కుమార్



**సంతనూతలపాడు, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో మత్స్యకారుల జీవితాల్లో పెను మార్పులు తీసుకొచ్చేందుకు గాను జువ్వలదిన్నెను విశేష అభివృద్ధి పరిచినట్లు సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెపై వైసీపీ నీచ రాజకీయం చేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఆరోపించారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో అటానమస్ మారిటైం షిప్ యార్డు, సిస్టం డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు ద్వారా దేశంలో అటానమస్ మారిటైం షిప్ యార్డు ద్వారా మరింతగా అభివృద్ధి చెందునని ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. దేశీయ రక్షణ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం, దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాల అభివృద్ధికి 45 కోట్ల రూపాయలు వ్యయంతో వెయ్యి మందికి ఉద్యోగాలు లభించునని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఏపీని మారిటైం రోబోటెక్స్ అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా మారనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 288.80 కోట్ల రూపాయలతో జువ్వలదిన్నె షిప్పింగ్ మరింతగా అభివృద్ధి జరిగినట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు. ప్రతి ఏడాది ఈ హార్బర్ ద్వారా 41 వేల టన్నుల చేపల దిగుబడి చేసే అవకాశం కలదన్నారు. అభివృద్ధి అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వంఅధికారంలో రాష్ట్రంలో పెట్టుబడులు ధ్యేయంగా ముందుకు పోతుందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత గూగుల్, మిట్టల్ లాంటి భారీ పెట్టుబడిదారులను ఏపీకి కూటమి ప్రభుత్వం తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. వైసీపీ పాలనలో జువ్వలదిన్నె అభివృద్ధికి పాటుపడిన దాఖలాలు లేవన్నారు. ఈనెల 15వ తేదీ ఏం సాధించారని జువ్వలదిన్నెను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తున్నారని ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఈ సందర్భంగా ప్రశ్నించారు.

## జలధర జల హారతి తదితర కార్యక్రమాలపై గ్రామాభివృద్ధి అధికారులతో ఎంపీడీవో సురేష్‌బాబు సమీక్ష



**సంతనూతలపాడు, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త)**
సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయం లో సోమవారం నాడు జలహారతి, తదితర అభివృద్ధి పనులపై గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులతో ఎంపీడీవో డి.సురేష్‌బాబు సమీక్షించారు. జల హారతి పనులను గ్రామాల్లో గుర్తించి గ్రామ సభల్లో ఆమోదించాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులను ప్రతి రోజు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పర్యవేక్షించాలన్నారు. గ్రామ పంచాయతీలలో అనధికార లేఅవుట్‌లు వేస్తే జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటికి చర్యల నిమిత్తం తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవోలు రవికుమార్, అరుణ కుమారి, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# రెవెన్యూ వారి హెచ్చరిక

## - ఇది మల్బరీ మోడల్ ఫారమ్ కోసం కేటాయించిన భూమి
## - ఆక్రమించుకుంటే అరెస్టే, దురాక్రమణకు తెగబడితే శిక్షే





**యర్రగొండపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం మండలంలోని సాయిబాబా నగర్ రోడ్డు పందివానిపల్లె గ్రామం దగ్గర ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టుపరిశ్రమ శాఖకు మోడల్ మల్బరీ ఫారమ్ కొరకు 18 ఎకరాల భూమిని 30 ఏళ్ళ క్రితం కేటాయించింది. అయితే గత కొన్నేళ్లుగా ఆలన పాలన లేని ఈ మల్బరీ మోడల్ ఫారం భూమిపై కన్నేసిన కొందరు యధేచ్ఛగా ఆ భూముల దురాక్రమణకు తెగబడ్డారు. పందివానిపల్లె గ్రామం దగ్గర 726 సర్వే నంబర్‌లో 10 ఎకరాలు ప్రభుత్వ భూమి, 28 సర్వే నంబర్‌లో 6.760 ఎకరాల ప్రభుత్వ బంజరు భూమి ఉంది. ఈ రెండు సర్వే నంబర్లలో ఉన్న మొత్తం 16.760 ఎకరాలను 30 సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మల్బరీ మోడల్ సాగుకోసం పట్టుపరిశ్రమ శాఖకు కేటాయించింది. అయితే గత కొన్ని సంవత్సరాల నుంచి మల్బరీ సాగు వైపు రైతాంగం దృష్టి సారించని నేపథ్యంలో మల్బరీ అవగాహన లేక ఆదరణ కోల్పోవడంతో ఇక్కడి ఈ మల్బరీ మోడల్ పొలం ఖాళీగా ఉండిపోయింది. పందివానిపల్లె గ్రామానికి ఈ పొలం దగ్గరగా ఉండడం వల్ల స్థానికంగా ఉండే రైతుల కన్ను ఈ పొలంపై పడింది. గత కొన్ని సంవత్సరాల నుంచి మల్బరీ వారి ఆలన పాలనతో పాటు.. వారి ఊసే కనపడకపోవడంతో అక్కడి సమీప పొలాల రైతులు ఆక్రమించుకోవడం మొదలు పెట్టారు. 28 సర్వే నంబర్‌లోని 6.670 ఎకరాలను పక్క పొలం వారు తమ పొలంలో కలిపేసుకునేందుకు పూనుకున్నారు. ఏకంగా 726 సర్వే నంబర్‌లోని 10 ఎకరాలను భూమిని వేరొకరు ఆక్రమణకు తెగబడ్డారు. సమాచారం అందుకున్న పట్టుపరిశ్రమలో పని చేస్తున్న సిబ్బందిఅడ్డుకొని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో ఈ 17 ఎకరాల భూమి పట్టుపరిశ్రమ శాఖ పేరుతో ఉండడం విశేషం.

# ఎస్సీ,ఎస్టీ,బీసీ ముస్లిం మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయండి



**యర్రగొండపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతిని ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనార్టీ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు జేఏసీ తెలిపింది. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించి బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలంకరణ అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జయంతి కార్యక్రమం జరుపుతున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర విద్యావంతుల వేదిక అధ్యక్షులు అంబటి నాగయ్య పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రజాగాయకులు చుక్క రామనర్సయ్య బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి కేంద్రం

## - జయంతిని ఘనంగా నిర్వహించాలి
## - బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి కేంద్రం జయంతిని ఘనంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు.అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించి ఆయనకు నివాళులు అర్పించాలని పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా ప్రాధాన్యత వంటి విలువలను సమాజంలో బలంగా నాటిన మహానేత అంబేద్కర్ అని ఆయన పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తోందని, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం దిశగా పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆటోలో మరిచిన బంగారం గంటల్లో ట్రేస్ చేసి అప్పగించిన మార్కాపురం పోలీసులు



**మార్కాపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

ఆటోలో మర్చిపోయిన బంగారు ఆభరణాలను మార్కాపురం పోలీసులు 24 గంటల్లోనే గుర్తించి బాధితురాలికి అప్పగించి తమ అప్రమత్తతను చాటుకున్నారు. మార్కాపురంలో జరుగుతున్న చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు నిమిత్తం బొమ్మనబోయిన జ్యోతి అనే మహిళ తన పుట్టింటికి వచ్చింది. తిరిగి తన స్వగ్రామమైన హనుమంతునిపాడు మండలం మల్లవరం వెళ్లే క్రమంలో బస్టాండ్‌కు ఆటోలో ప్రయాణించింది. ఈ సమయంలో చీరలతో పాటు సుమారు రూ.2.5 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను ఆటోలోనే మర్చిపోయింది.విషయం గుర్తించిన వెంటనే జ్యోతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన మార్కాపురం పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సమాచారం ఆధారంగా కొద్ది గంటల్లోనే ఆ ఆటోను గుర్తించారు.తదుపరి, ఆటోలో ఉన్న చీరలు మరియు బంగారు ఆభరణాలను సురక్షితంగా స్వాధీనం చేసుకుని, సీఐ సుబ్బారావు చేతుల మీదుగా బాధితురాలికి తిరిగి అప్పగించారు.

# ప్రజా సమస్యలపై పోలీసుల ఫోకస్ ..

## - మార్కాపురంలో మీకోసం" కార్యక్రమం

**మార్కాపురం, ఏప్రిల్ 13,(ప్రభాతవార్త)**

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలనే లక్ష్యంతో మార్కాపురం జిల్లా పోలీసులు మీకోసం" ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపించారు.ఈ సందర్భంగా మొత్తం 39 ఫిర్యాదులు నమోదు అయ్యాయి. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగ సంబంధిత సమస్యలు, ఆన్‌లైన్ మోసాలు, భూ వివాదాలు వంటి పలు అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ యు. నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. పోలీస్ అధికారులు ఫిర్యాదిదారులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విని వివరాలు సేకరించారు.ఫిర్యాదులను సవివరంగా పరిశీలించి, చట్టపరమైన విధానాల ద్వారా త్వరితగతిన పరిష్కారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు,సబ్‌డివిజన్ కార్యాలయాల్లో కూడా సమర్పించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం,పామూరు,కంభం సీఐలు,ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






మార్కాపురం వార్త

# మంత్రి నారా లోకేష్‌తో కలిసి రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ తెన్నేటి



**చీరాల, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి బిల్లును ఆమోదించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి, యువ నాయకులు నారా లోకేష్ భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సోమవారం ఈ మేరకు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతిని కలిసిన నారా లోకేష్‌తో కలిసి పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ ఇతర ఎంపీలు పాల్గొని రాష్ట్రపతికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేయడం తమకు దక్కిన ఒక గొప్ప అవకాశంగా అభివర్ణించారు. రాజధానిపై ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న స్పష్టతను తీసుకురావడంలో రైతుల అసాధారణ పట్టుదల, త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని కొనియాడారు.

# పుష్పాలతో పులకించిన సన్నిధి...

## - చెన్నకేశవస్వామి పుష్పయాగం దివ్య వైభవం...







**మార్కాపురం, ఏప్రిల్ 13,ప్రభాతవార్త**

శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 13వ రోజు నిర్వహించిన పుష్పయాగం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనచార్యులు, వేదపండితుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడింది.ఉదయం నుంచే ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామివారికి స్నపన తిరుమంజనం అనంతరం పుష్పయాగానికి శ్రీకారం చుట్టారు.గులాబీ, మల్లె, చామంతి, కనకాంబర తదితర సువాసన పుష్పాలతో స్వామివారిని అలంకరించి, పుష్పార్చనలు నిర్వహించారు. వేదమంత్రాల నాదం మధ్య పుష్పాలను సమర్పిస్తూ చేసిన యాగం భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది.పుష్పయాగం ద్వారా బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన లఘు దోషాలు నివృత్తి అవుతాయని, లోకక్షేమం, సర్వజన సుఖశాంతి కలగాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక హారతులు, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దర్శనం పొందారు.ఆలయ కార్యనిర్వాహణ అధికారి గోలమారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, భక్తుల విశేష స్పందన మధ్య బ్రహ్మోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మికంగా మరింత పరిపూర్ణత సాధించాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు, భక్తులు భారీగా పాల్గొని పూజల్లో పాల్గొన్నారు.

# అబ్యాస్ ఉత్సవంలో సాయి చైతన్య విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన

**మార్కాపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

గుంటూరులో నిర్వహించిన 12వ అబ్యాస్ ఉత్సవం స్టేట్ లెవెల్ అవార్డు కార్యక్రమంలో సాయి చైతన్య స్కూలు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలువిభాగాల్లో స్టేట్ స్థాయి అవార్డులను అందుకున్నారు. కెశాట్ పరీక్షలో ఎ వీక్షిత రెడ్డి, డి హరి కైలాష్, ఎన్ ప్రిన్స్ ముగ్గురు విద్యార్థులు స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటారు. ఆర్ఎమ్ఎమ్ పరీక్షలో ఎమ్ ప్రణీత స్టేట్ సెకండ్ ర్యాంక్, ఎస్ శ్రీనాద్‌రెడ్డి స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించారు. ఆర్ఎస్ఎమ్ పరీక్షలో ఎన్ రాజశ్రీ స్టేట్ ఫస్ట్ ర్యాంక్, జె ప్రియాంక సెకండ్ ర్యాంక్, టి శివ జస్వంతి థర్డ్ ర్యాంక్ సాధించి అగ్రస్థానాల్లో నిలిచారు. బివివిఎస్ పరీక్షలో పి సాయి చరణ్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఈ. నందీశ్వర్ స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించారు.ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సెక్రటరీఎమ్ శ్రీనివాసరావు,కరస్పాండెంట్ ఎమ్ చంద్రశేఖర్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులోమరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




# తాగునీటి ఎద్దడి నుంచి రక్షించండి

## - కలెక్టర్‌ను కోరిన భగత్‌సింగ్ కాలనీవాసులు



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

తాగునీటి ఎద్దడి నుంచి తమను రక్షించాలని జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీవాసులు జిల్లా కలెక్టర్ విజయసునీతను కోరారు.ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టిడిపి నాయకులు చల్లగాలి విద్యాసాగర్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ కాలనీవాసులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని బోర్లకు నీళ్ళు సరిగా అందకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎండలు ఎక్కువగా వుండడంతో తాగునీటికోసం నానా అవస్థలు పడుతున్నామన్నారు. నీటి వసతి కల్పించి తమను ఆదుకోవాలని కాలనీవాసులు కోరారు. దీంతో కలెక్టర్ విజయసునీత స్పందించి తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే పైపులైన్ కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

# పగిలిన అద్దంతోనే ప్రయాణం...

## - మార్కాపురంలో ప్రైవేట్ బస్సుపై ప్రయాణికుల ఆందోళన

**మార్కాపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

మార్కాపురంలో ప్రైవేట్ ట్రావెల్స్ నిరక్ష్యం మరోసారి బయటపడింది. బెంగుళూరుకు బయలుదేరాల్సిన ( ఎస్ ఎల్ ఎన్ ఎస్ టి ) ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఫ్రంట్ అద్దం పగిలిన పరిస్థితిలోనే ప్రయాణానికి సిద్ధం చేయడం ప్రయాణికుల్లో ఆందోళన కలిగించింది.బస్సులో ఎక్కిన ప్రయాణికులు అద్దం పగిలిన విషయం గమనించి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని భావించి వెంటనే అభ్యంతరం వ్యక్తం చేశారు.అనంతరం మార్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే స్పందించి బస్సును స్టేషన్‌కు తరలించారు. సిఐ సుబ్బారావు ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అదే బస్సుతో ప్రయాణం కొనసాగించకుండా,సురక్షితమైన మరో వాహనాన్ని ఏర్పాటు చేయాలని ట్రావెల్స్ నిర్వాహకులకు ఆదేశించారు. ఈ ఘటనతో ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థల భద్రతా ప్రమాణాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా వాహనాలను నడపడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రజా సేవలపై నిఘా మార్కాపురంలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు

**మార్కాపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**




మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పట్టణంలోని కీలక ప్రభుత్వ సేవలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై ప్రత్యక్షంగా అవగాహన పొందుతూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మొదటగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రినిసందర్శించిన ఎమ్మెల్యే, రోగులు మరియు వారి బంధువులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రతి వార్డును పరిశీలిస్తూ చికిత్స విధానం,సదుపాయాలపై విచారణ జరిపారు. ఆసుపత్రి వైద్యులతో సమావేశమై లోపాలు ఉన్నచోట వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. రేపు మధ్యాహ్నం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.తర్వాత ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, ప్రయాణికులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు.అనంతరం సమీపంలోని అన్నాక్యాంటీన్‌ను తనిఖీచేసి అక్కడ భోజనం చేస్తున్న వినియోగదారులతో మాట్లాడారు. భోజనం నాణ్యత,రుచి, పరిశుభ్రతపై అభిప్రాయాలు అడిగారు. వినియోగదారులు భోజనం రుచికరంగా, శుభ్రంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే,ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. గతంలో అన్నా క్యాంటీన్ల మూసివేత ప్రజలకు ఇబ్బందులు కలిగించిందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానిక ప్రతినిధులు ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు.

# చిన్న దోర్నాలలో ఆధునిక సాంకేతికతతో వేమన ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం

**పెద్దదోర్నాల, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**




గ్రామీణ పట్టణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో దోర్నాల బట్టు విద్యా సంస్థలచైర్మన్ బట్టు రమణారెడ్డి, గుంటూరు అమెరికన్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చిన్నదోర్నాలలో ఆధునిక సాంకేతిక సామర్థ్యాలతో వేమన ఇంటర్నేషనల్ స్కూల్ ఘనంగా ప్రారంభమైంది.విద్యా రంగంలో నూతన ప్రమాణాలను స్థాపించాలనే సంకల్పంతో ఈ పాఠశాలను ఏర్పాటు చేసినట్లు పెద్దదోర్నాల బట్టు విద్యా సంస్థల చైర్మన్ బట్టు రమణారెడ్డి తెలిపారు. పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, డిజిటల్ బోర్డులు,సైన్స్,కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, క్రీడా సదుపాయాలు అన్ని ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన సిలబస్ ద్వారా విద్యార్థుల మేధస్సు, సృజనాత్మకత, నైపుణ్యాభివృద్ధి చేయటం లక్ష్యమని అన్నారు. విద్యా రంగంలో కొత్త దిశగా అడుగులు వేస్తున్న వేమన ఇంటర్నేషనల్ స్కూల్ భవిష్యత్తు తరాలకు వెలుగునిచ్చే కేంద్రంగా ఉండాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. మనకు నచ్చిన వస్తువు కోసం 100 షాపులైన తిరుగుతామా..? లేదా..? అదే క్రమంలో మీ పిల్లల వందేళ్ల జీవితం కోసం వేమన ఇంటర్నేషనల్ స్కూల్‌ను సందర్శించి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయండి అంటూ స్కూల్ యాజమాన్యం పిలుస్తోంది. అమెరికాలో చదివిన జక్కిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ జి.శ్యాం ప్రసాద్‌రెడ్డి సారథ్యంలో నాలుగు ఎకరాలలో వేమన ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేసి నర్సరీ నుండి ఐదవ తరగతి, 6వ తరగతి నుండి పదవ తరగతి వరకు, ఐఐటీ, జేఈఈ,నీట్ కేరళ,ఒడిశా, నాగాలాండ్ టీచర్స్ చే విద్యాబోధన చేపట్టినట్లు తెలిపారు. దోర్నాల పట్టణ, గ్రామీణ ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని పిల్లలకు సీటు రిజర్వేషన్ చేసుకోవాల్సిందిగా బట్టు విద్యాసంస్థల చైర్మన్ బట్టు రమణారెడ్డి తెలిపారు.

# న్యాయమైన తమ డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన విఓఏలు

**త్రిపురాంతకం, ఏప్రిల్ 13,ప్రభాతావార్త**

రాష్ట్ర విఓఏల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ మండలంలోని విఓఏలు మండల తహసీల్దార్ విజయ భాస్కర్ కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇరవై వేల మంది వి ఓ ఏ లు పని చేస్తు, పొదుపు మహిళా సంఘాలకు తమ సేవలను అందిస్తున్నామని, అయిన కనీస వేతనాలను చెల్లించడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.హెచ్ ఆర్ సి పాలసీని అమలు చేయాలని,శ్రీనిధి ఇన్సెంటివ్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని,సెల్ ఫోన్స్, గ్రూప్స్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని,పది లక్షల వరకు వడ్డీ రాయితిని చెల్లించాలని,వి ఓ ఏ ల అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులను ఆపాలని తదితర డిమాండ్లను వెంటనే పరిష్క రించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మండల సి ఐ టి యూ మండల కార్యదర్శి ఎనిబెర లాభాను,సి ఐటియూ సభ్యురాలు జ్యోతి,విఓఏ లు అచ్చుమ్మ, విజయ లక్ష్మి,గోవర్ధన్,ఎం రమణ, అంజలి,అది లక్ష్మి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



8_8.qxd 4/13/2026 11:49 PM Page 1



### స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యం

# బాధల్లో ఉన్న వారికి భోజన భరోసా



**కనిగిరి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం పేద రోగులు, వారి బంధువులు, ఆహార వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఉచిత భోజన వసతి కల్పించి ఆపన్న హస్తం అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, అనాధలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్రస్టు సభ్యులు స్వయంగా వండిన భోజనం పంపిణీ చేస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్టు కన్వీనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ పేదవారికి ఆహారం అందించడం ద్వారా కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని తెలిపారు. మనం చేసిన చిన్న సహాయం కూడా ఎన్నో కుటుంబాల్లో ఆశను నింపుతుంది. ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తూ మరెందరికో ఉపశమనం కలిగించడం మా లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా అనేక మంది రోగులు, వారి బంధువులు, పేదలు ఉపశమనం పొందుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు సభ్యులు మీరా మొహిద్దిన్, కిషోర్‌బాబు, ఖాశీం పీరా, మెర్లిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో 2వ వార్డులో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**కనిగిరి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో కొత్తగా మంజూరైన డ్రైనేజీ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టౌన్ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాలరవి, మున్సిపల్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. అలాగే పెన్నా వెంకటేశ్వర్లు, పచ్చవ చంద్రశేఖర్, నారాయణ, రవి, సాగర్ తదితరులు హాజరయ్యారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా డ్రైనేజీ సౌకర్యాల మెరుగుదల కోసం ఈ పనులు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.

## పామూరు నుండి మార్కాపురంకు బస్సు సౌకర్యం కల్పించాలి

### - గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చిన సీపీఐ నాయకులు

**పామూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
జిల్లా కేంద్రమైన మార్కాపురంనకు ఏదైనా పనుల నిమిత్తం వెళ్ళవలసి వస్తే ప్రజలు అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని సీపీఐ జిల్లాకార్యదర్శి ఎంఎల్ నారాయణ,పామూరు మండల కార్యదర్శి పి.ప్రభాకర్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో అర్జీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కాపురం జిల్లా ప్రకటించి మూడు నెలలు అవుతున్నా కనీసం పామూరు నుండి ఒక్క బస్సు సర్వీస్ కూడా నడపడం లేదని వారు అన్నారు. మార్కాపురం వెళ్లాలంటే దాదాపుగా మూడు బస్సులు మారాల్సి వస్తుందని, దీని వలన వృద్ధులు, వికలాంగులు, మహిళలు రావాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మార్కాపురంకు బస్సు సౌకర్యం కల్పించి ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఇటీవల ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ పామూరు నుండి మార్కాపురంనకు బస్సులు నడపలేమని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని వారు అన్నారు. వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలను కలుపుకొని పోరాటాలు చేయాల్సి వస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# జనగణన 2027 శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**వేటపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
16వ జనగణన 2027 కార్యక్రమానికి సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మండలానికి సంబంధించి మొత్తం ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్లను మూడు బ్యాచ్‌లుగా విడగొట్టి ఒక్కొక్క బ్యాచ్‌కి మూడు రోజుల పాటు మొత్తం తొమ్మిది రోజులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మొదటి బ్యాచ్ శిక్షణను సోమవారం నాడు స్థానిక మండల కార్యాలయ ప్రాంగణం నందు గల ఐసీడీఎస్ సమావేశ కార్యాలయం నందు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం జనగణన కార్యక్రమాన్ని రెండు దశల్లో అమలు చేయనున్నారు. తొలి దశ ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు హౌస్ హోల్డింగ్ కొనసాగగా, రెండో దశ జనగణనను 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈశిక్షణ కార్యక్రమాలకు ఆర్‌వి శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు. జనగణన ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను శిక్షణలో అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# దాత్రాలయ విద్యార్థుల పారితోషికం



**వేటపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
వేటపాలెంలో గల జీవీకేసీ స్వామి దయానంద సేవాశ్రమ నందు గల విద్యార్థులకు రాబోయే నూతన తరగతి ప్రవేశంకు ముందుగానే పుస్తకాల కొనుగోలు నిమిత్తం ఎర్రబోతు సందీప్ కుమార్ 300 రూపాయల పారితోషికం అందించినట్లు పట్టభద్రుల సంఘం వెల్లడించింది. పట్టభద్రుల సంఘం ద్వారా సేవా ఆశ్రమం గురించి తెలుసుకున్న సందీప్ కుమార్ అమెరికాలో ఉన్నత ఉద్యోగం చేస్తూ విద్యార్థులకు ఎంతో కొంత సహాయపడాలనే సదుద్దేశంతో వారి తల్లిదండ్రులు అయినా సీతారామయ్య రమాదేవిలకు సూచనలు ఇచ్చి సోమవారం నాడు విద్యార్థులకు నగదును అందజేయడం జరిగింది. కార్యక్రమంలో పట్టభద్రుల సంఘం అధ్యక్షులు పత్తి వెంకట సుబ్బారావు పాల్గొని పరీక్షలు అయిపోయి, కొత్త తరగతిలో ప్రవేశమవుతున్న సందర్భంలో సందీప్ కుమార్, వారి తల్లిదండ్రులు నగదు రూపంలో పారితోషికం అందజేయడం ఆనందంగా ఉందని చెబుతూ, స్వామి దయానంద ఆశీస్సులు వారికి కలగాలని ప్రార్ధించారు.

# డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళులు

**వేటపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమారం క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు క్లబ్ నిర్వాహకులు ఉమ్మిటి వేణుగోపాలరావు తెలిపారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని, ఉపాధ్యాయులు అంబేద్కర్ చిత్రపటానికిపూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ శతాబ్దాలుగా చారిత్రక వివక్ష, సామాజిక అణచివేతకు గురైన వర్గాలకు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు చట్టసభలలో ప్రవేశానికి రాజ్యాంగ బద్దంగా అవకాశాలు కల్పించి, వారిని సామాజికంగా ఆర్ధికంగా రాజకీయంగా ఉన్నత స్థానంలో ఉంచిన సామాజిక సంస్కర్త అంబేద్కర్ అని కొనియాడారు. క్రియేటివిటి అండ్ ఇన్నోవేషన్ క్లబ్ నిర్వాహకులు వేణుగోపాల్ మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైన , ఆత్మగౌరవంతో జీవించాలని, రాజకీయాలలో భాగస్వాములు కావాలని బలంగా విశ్వసించి, హిందూ కోడ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, మహిళలకు విద్య, ఆస్తిహక్కు ఉద్యోగాలు, రాజకీయాలలో పురుషులతో పాటు సమాన హక్కులుకల్పించడానికి అంబేద్కర్ కృషి చేశారన్నారు. ఒక సమాజం ఎంత పురోగమించిందో, ఆ సమాజంలోని మహిళల పురోగతిని బట్టి నేను కొలుస్తాను అన్న మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కీర్తించారు. చిన్నతనం నుండే తీవ్రమైన కుల వివక్షను ఎదుర్కొన్న అంబేద్కర్, విద్యను ఆయుధంగా చేసుకుని, ఉన్నత చదువులు చదివి, భారతదేశంలో అత్యంత విద్యావంతులుగా నిలిచి, భారత రాజ్యాంగాన్ని రూపొందించారని, కనుక విద్యార్థులు అందరూ బాబాసాహెబ్ చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వంతో కూడిన అభివృద్ధి చెందిన భారత దేశాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మార్చి నెలలో నిర్వహించిన వ్యాసరచన, వికృత్వ, చిత్రలేఖన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన 6,7,8తరగతుల విద్యార్థులకు క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్ క్లబ్ తరుపున బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## సోలార్ రూఫ్ టాప్ యూనిట్లతో అందరికి ఉపయోగం

### - ఛార్జీలు తగ్గాలంటే పునరుత్పాదక విద్యుత్తే ప్రత్యామ్నాయం
### - రాష్ట్ర వ్యాప్తంగా రూ.8 వేల కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు
### - దర్శి నియోజకవర్గంలో పీఎం సూర్యఘర్ అమలుకు రూ.50.39 కోట్లు
### - ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్










**దర్శి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
రోజు రోజుకు పెరుగుతున్న కరెంట్ వాడకం, పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు,ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రజలందరూ సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం, దొనకొండ మండలంలోని మల్లంపేట కాలనీలో మంత్రి గొట్టిపాటి సోమవారం నాడు పర్యటించారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా గ్రామంలోని 44 ఎస్సీ కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుంటూ పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల వినియోగాన్ని పెంచుకోవాలని ప్రజలకు సూచించారు. సబ్సిడీతో కూడిన సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఒక్కో సోలార్ ప్లాంట్‌తో సుమారు 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా కోటి సోలార్ కనెక్షన్లకు ప్రధాని మోడీ అనుమతులు ఇస్తే అందులో 20 లక్షలు ఆంధ్రప్రదేశ్‌కే కేటాయించారని మంత్రి గొట్టిపాటి గర్వంగా చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8వేల కోట్ల ఆర్డీఎస్ఎస్ నిధులతో కొత్త విద్యుత్ లైన్లు, స్తంభాలు ఏర్పాటు, మౌలిక వసతులు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దర్శి నియోజకవర్గంలో ఆర్డీఎస్ఎస్ పనుల కోసం రూ.147 కోట్లు మంజూరు చేశామని, ఇందులో రూ.115 కోట్లకు సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయన్నారు.

**మల్లంపేట పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి :**
మల్లంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.11లక్షల వ్యయంతో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత వడ్లమూడి భూపాల్‌ను అభినందిస్తూ.. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు పీ4లో భాగంగా ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు అవకాశం ఉన్న మరింత మంది ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుతో ప్రైవేటుకు ధీటుగా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ,మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పలువురు పాల్గొన్నారు.

### తమిళనాడు అసెంబ్లీ ఎలక్షన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరుపున

# ఎలక్షన్ పరిశీలకులుగా కైపు



**దర్శి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
ఏప్రిల్ 23న తమిళనాడులో జరగబోతున్న అసెంబ్లీ ఎలక్షన్‌కు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తరుపున ఎలక్షన్ పరిశీలకులుగా ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్ర అసంఘటిత కార్మికుల,ఉద్యోగుల చైర్మన్ కేకేసీ,దర్శి నియోజకవర్గ సమన్వయకర్త కైపు వెంకట కృష్ణారెడ్డిని నియమించారు.ఈ సందర్భంగా కృష్ణారెడ్డి తనను నియమించినందుకు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ,ఉదిత్ రాజు అలాగే షర్మిలా రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## వృద్ధాశ్రమానికి బియ్యం, కందిపప్పు అందించిన దాత కొమిరిశెట్టి



**దర్శి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన కొమిరిశెట్టి నాగరాజు,సుహాసినిల కుమారుడు కొమిరిశెట్టి శశాంత్, నాగతేజస్విల పుట్టిన రోజు వేడుకలను స్థానిక శ్రీషిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా వృద్ధాశ్రమానికి 50 కేజీల బియ్యం,కందిపప్పు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నాగేశ్వరరావు, కోటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న గొట్టి పాటిలక్ష్మీ, లలిత్ సాగర్



**దర్శి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
దర్శి మండలం వెంకటాచలంపల్లి గ్రామంలో కెమెరామెన్ పుప్పాల నరేంద్ర, సుస్మితల కుమారుడు రియాంష్ తేజ్ మొదటి పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, యువ నాయకులు కడియాల లలిత్‌సాగర్ దంపతులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు కాట్రాజు నాగరాజు, సానే సుబ్బయ్య, కూటమి శ్రేణులు ఉన్నారు.

## నూతన వస్త్రబహుకరణ వేడుకలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
దర్శి మండలం తానంచింతల గ్రామంలో కోటయ్య-విజయమ్మల కుమార్తె మౌనిక నూతన వస్త్ర బహుకరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ వేడుకకు దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువనాయకులు కడియాల లలిత్ సాగర్‌లుపాల్గొని చిన్నారి మౌనికను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు,కాట్రాజు నాగరాజు,దర్శిటౌన్ పార్టీ అధ్యక్షులు చిన్నా,సానే సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం,తానంచింతల గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై పోలీసుల దాడి



**లింగసముద్రం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
లింగసముద్రం మండలం ముత్యాలపాడు గ్రామ శివారులో పేకాటశిబిరంపై పోలీసులు దాడి నిర్వహించారు.సోమవారం సాయంత్రం ఎస్సై జి.రాంబాబు తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి రూ.13,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాంబాబు మాట్లాడుతూ లింగసముద్రం మండలంలో పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని ఆయన కోరారు.

## నేడు చింతలపూడి పర్యటన వివరాలు



**అద్దంకి ,ఎఫ్రియల్ 13,ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఉదయం 10గంటలకు బంగ్లా రోడ్డులోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిస్తారని, ఆయన కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

## డబుల్స్ బ్యాడ్మింటన్ విజేతలు అభిరామ్, శ్రీనివాసరావు





**కొరిసపాడు, ఎఫ్రియల్ 13, ప్రభాతవార్త**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మేదరమెట్ల అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన డబుల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజయవంతంగా జరిగింది. ఆదివారం సాయంత్రం, జరిగిన ఈ టోర్నమెంట్లో మొదటి బహుమతి రు.10116 రూపాయలను మేదరమెట్ల గ్రామానికి చెందిన అభిరామ్, శ్రీనివాస రావులు గెలుపొందారు. ద్వితీయ బహుమతి రు.7116 రూపాయలు పంగులూరుకు చెందిన సందీప్,వలీలు గెలుపొందారు. మూడవ బహుమతి రు.5116 రూపాయలను అద్దంకికి చెందినభాష, ఖాజాలు, నాలుగవ బహుమతి రు. 3116 రూపాయలను వలపర్లకు చెందిన నాగేశ్వరరావు, గురుభక్తలు గెలుపొందారు.బెస్ట్ ఎమర్జింగ్ ప్లేయర్స్ గా కొరిసపాడు గ్రామానికి చెందిన అనురూప్, వెంకీలు. బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా అభి రామ్ మేదరమెట్ల గెలుపొందారు. ఈ టోర్నమెంట్లలో గ్రామ సర్పంచ్ కుమారుడు మధు, గ్రామంలోని కూరగాయల వ్యాపారి జ్యోతి రమేష్ లతోపాటు పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# జడ్పీ హైస్కూల్ టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

### - విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తల్లిదండ్రుల ఆగ్రహం
### - పార్కులో ప్రెస్‌మీట్ నిర్వహించి వివరణ ఇచ్చిన గ్రామస్తులు





**వేటపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని జడ్పీ హైస్కూల్ ఎదుట ఉన్న పార్కులో నాలుగు రోజుల క్రితం జరిగిన చిన్నపాటి వాగ్వాదం ఇప్పుడు వివాదంగా మారింది. క్రికెట్ ఆడుకుంటున్న పిల్లలు, అదే పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న శివపార్వతి మధ్య ఈ వాగ్వాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. పాఠశాల సమయం ముగిసిన అనంతరం ఆ పార్కులో కోలాటం కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో అక్కడ క్రికెట్ ఆడుతున్న పిల్లలతో టీచర్‌కు మాటల ఘర్షణ జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై టీచర్ పోలీసులకు కంప్లైంట్ చేయగా పోలీసులు వచ్చి అక్కడ ఆడుతున్న పిల్లలను ఇక్కడ క్రికెట్ ఆడొద్దని చెప్పారు. ఈ క్రమంలో పిల్లల తల్లిదండ్రులు టీచర్‌ను ఈ విషయం గురించి పోలీసులకు ఎందుకు కంప్లైంట్ ఇచ్చావు పోలీసు కేసు అయితే మా పిల్లల భవిష్యత్తు ఏం కావాలి అని ఆమెను అడగటానికి వచ్చినప్పుడు స్కూల్ బయట వద్దు అందరూ చూస్తున్నారు, స్కూల్లోకి రండి మాట్లాడుకుందాం అని పిలిపించింది. స్కూల్లో దీని గురించి ఆమెతో మాట్లాడుతుండగా ఈ ఘటనను ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడంతో విషయం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి పార్కులో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి టీచర్‌పై పలు ఆరోపణలు చేశారు.విద్యార్థుల కులం గురించి అడిగి, వారు చెప్పిన సమాధానంపై అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. మీరు దేవాంగ పిల్లల్లా కనిపించరు, మాల - మాదిగ పిల్లల్లా ఉన్నారు అంటూ వ్యాఖ్యానించారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన టీచర్‌పై తీవ్రంగా స్పందించిన తల్లిదండ్రులు ఇది టీచర్ మాట్లాడే తీరు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు శుభ్రంగా దుస్తులు వేసుకుని వచ్చినా హేళన చేస్తారని కోలాటానికి రాకపోయినా దూషణాత్మకంగా మాట్లాడుతారని చెప్పారు. అలాగే, పిల్లలను బయట కార్యక్రమాలకు తీసుకెళ్లి అక్కడ ఇచ్చే డబ్బులను కూడా స్వయంగా వసూళ్లు చేసుకుంటున్నారని కొందరు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయంపై పేరెంట్స్ కమిటీ చైర్మన్ కూడా స్పందిస్తూ, టీచర్ ప్రవర్తన సరిగా లేదని, విద్యార్థులతో అనుచితంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఇక పూర్వ విద్యార్థులు కూడా ఈ వ్యవహారాన్ని ఖండించారు. మేము ఈ పాఠశాలలో చదివి, అభివృద్ధి కోసం ఎన్నో విరాళాలు అందజేశామని, పుస్తకాలు కూడా ఇచ్చాం,కానీ ఇప్పుడు ఈ టీచర్ కారణంగా పాఠశాల ప్రతిష్ఠ దెబ్బతింటోంది అని వాపోయారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# అందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

### - సీపీఎం జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ డిమాండ్




**వేటపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**
మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టి ఆర్డీవో తహసీల్దార్ సమక్షంలో వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శితన్నీరు సింగరకొండ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. పెద్ద పెద్ద కంపెనీలు, పారిశ్రామిక వేత్తలకు వందల ఎకరాల భూములు కేటాయిస్తున్న ప్రభుత్వం అందులో కొంత భాగాన్ని అయినా పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలో ఒకే సర్వే నంబర్‌లో సుమారు 8 ఎకరాల భూమి ఉండగా దానిని డొంక భూమి స్మశానం వంటి పేర్లతో చూపిస్తూ, సుమారు 25 మంది ఆక్రమించుకున్నారని సమాచారం హక్కు చట్టం ద్వారా అధికారులు వెల్లడించినప్పటికి ప్రస్తుతం ఆ భూమి ఇళ్ల మధ్యలో ఉండడంతో పేదలు స్థలాల కోసం కోరుతున్నప్పటికి వివిధ కారణాలు చూపుతూ దూరం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు మారినా పేదల సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దోమా రాజారెడ్డి, సీనియర్ నాయకులు అచ్యుతుని బాబురావు, వీర్లంకమ్మ,నాగమణి, మస్తాన్‌రెడ్డి, నాయుడు సీతారామరెడ్డి, సమ్మటి శివపార్వతి, మర్రి మస్తానమ్మ, ఆట్ల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి



**సింగరాయకొండ, ఏప్రిల్ 13,ప్రభాతవార్త**
ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపుపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలని ఎంఈఓ కత్తి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఎంపీపీఎస్ వెస్ట్ పాఠశాలను పర్యటించి పాఠశాల నిర్వహణ, విద్యా కార్యక్రమాలను సమీక్షించారు.ఈ సందర్భంగా జీఎఫ్‌ఎల్ఎన్ (GFLN), ప్రవేశోత్సవ కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన (ఎండీఎం) రిజిస్టర్లు, స్టాక్ వివరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి చేరిన విద్యార్థుల అడ్మిషన్లను పరిశీలించి, ప్రవేశాల పెంపుపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో చర్చించారు. ఒకే రోజు 18 మంది విద్యార్థులను చేర్చడాన్ని అభినందించారు. గ్రామంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని అవగాహన కల్పించారు. పాఠశాలలో ఇంగ్లీష్ బోధన మెరుగ్గా ఉందని, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మారాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆవుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సురేంద్ర, శ్రీదేవి, సుజాత, అండలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

